సాక్షి విశాఖపట్నం

శనివారం । 2 । డిసెంబర్ । 2023



బాధితులకు తోడ్పాటు

ఎయిడ్స్ బారిన పడిన చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అందరూ ముందుకు రావాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. 8లో



ఈ నెలలోనే విశాఖ నుంచి సీఎం జగన్ పాలన 8లో



హెచ్‌పీసీఎల్ సాయం

హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు రూ.1.22 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందించనుంది. 8లో

న్యూస్‌రీల్

మత్స్యశాఖ జేడీగా షేక్ లాల్ మహ్మద్



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షేక్ లాల్ మహ్మద్

మహారాణిపేట: మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా షేక్ లాల్ మహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన జేడీ విజయను బదిలీ చేశారు. కోనసీమ జిల్లా జేడీగా పనిచేస్తున్న షేక్ లాల్ మహ్మద్‌ను విశాఖ జిల్లా జేడీగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిశారు.

కేజీహెచ్‌లో మరో నకిలీ నియామక ఉత్తర్వు

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రిలో మరో నకిలీ నియామక ఉత్తర్వులు కలకలం రేపింది. గత నెల 27న షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు సంబంధించి మహిళ పేరుతో నకిలీ అపాయింట్‌మెంట్ ఆస్పత్రిలో సంచలనం రేపిన సంగతి విధితమే. నాలుగు రోజుల వ్యవధిలో మరో నకిలీ ఉత్తర్వు బయటపడడంతో వెనుక సిబ్బంది పాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేజీహెచ్ ఎస్‌టీఎస్‌యూ యూనిట్‌లో స్టాఫ్ నర్సుగా తనకు డీఎంహెచ్‌వో నియామక ఉత్తర్వులు ఇచ్చారని ఓ మహిళ అధికారులను సంప్రదించింది. అయితే ఈ యూనిట్ కేజీహెచ్‌లో లేదు. దీంతో అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ ఉత్తర్వులుగా అధికారులు నిర్ధారించారు. దీంతో ఈ విషయాన్ని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ చేస్తున్నారు.

విశాఖ-గుణుపూర్-విశాఖ రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, నౌపడ-పర్లాకిమిడి సెక్షన్ పరిధిలో ఈ నెలలో ప్రతి ఆది, బుధ వారాలలో ట్రాఫిక్ కం పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఆయా తేదీల్లో విశాఖ-గుణుపూర్-విశాఖ రైళ్ల రద్దు చేస్తున్నట్లు మరి కొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3,6,10,13,17,20,24,27,31 తేదీలలో విశాఖ-గుణుపూర్ -విశాఖ (08522/08521) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు చేశారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంతంలో ఈదురు గాలులు బలంగా వీస్తుండడంతో రుషికొండ బీచ్‌లో బోటు షికారు నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో గాలితో పాటు కెరటాలు భారీ ఎత్తున ఎగసి పడుతున్నాయని, ఈ క్రమంలో బోటు షికారు నిలిపి వేశామని పర్యాటకులు దీనిని గమనించాలన్నారు.

నాలెడ్జ్ హబ్‌గా ఏపీ

బీచ్‌రోడ్డు: ప్రపంచంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాలెడ్జ్, స్కిల్ హబ్‌గా మార్చడమే లక్ష్యమని స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డిపార్టమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలను శుక్రవారం మీడియాకు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో స్కిల్ క్యాస్కేడ్ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి సంస్థలను పునరుద్ధరణపై దృష్టి సారించామన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేత విశాఖలో ఏపీ స్కిల్స్ యూనివర్స్ అప్లికేషన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ముగిసిన అధికారిక భాషా అమలు కమిటీ సమావేశం



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం 77వ టౌన్ అధికారిక భాషా అమలు కమిటీ సమావేశం ఘనంగా ముగిసింది. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం, కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో అధికారిక భాషా అమలు, వ్యాప్తి గురించి చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మనోజ్ కుమార్ సాహూ, వీరేంద్రకాజీ పాల్గొన్నారు.

ఓటు నమోదులో యువచైతన్యం



- కొత్తగా చేరిన 24,013 మంది నవతరం ఓటర్లు
- మరింత మందిని చేర్పించేందుకు అవగాహన సదస్సులు
- ఇప్పటి వరకూ 51,143 ఎపిక్ కార్డుల పంపిణీ
- 16 మంది నోడల్, 143 మంది సెక్టార్ అధికారుల నియామకం
- ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణ

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమరానికి సమయం సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఈసారి తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువ ఓటర్లు సైతం తమ పాశుపతాస్త్రాన్ని పొందేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటి వరకూ ఫారం-6 ద్వారా 18-19 ఏళ్ల లోపు వారు 24 వేల మందికి పైగా ఓటుహక్కుని తొలిసారిగా పొందారు. మరింత మందిని చేర్పించేందుకు కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఓటర్ల సవరణ పూర్తయిన వారికి ఎపిక్‌కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుండగా.. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే వారికి శిక్షణ కార్యక్రమాలు కూడా అధికారులు కొనసాగిస్తున్నారు.

2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రకటించాల్సిన నేపథ్యంలో సవరణ ప్రక్రియ మరింత వేగవంతంగా జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఓవైపు.. జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై వచ్చిన అభ్యంతరాలను డీఆర్‌వో కే.మోహన్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు కొత్త ఓటర్లు నమోదుకు అవసరమైన అవగాహన సదస్సులను ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా డివిజన్ పరిధిలోని కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. సవరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది. ఇప్పటి వరకూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివరాలు, ఎన్నికల సిబ్బంది నియామకం, తదితర అంశాల్ని ఓసారి పరిశీలిస్తే.

- కొత్తగా ఓటు హక్కు పొందిన 18-19 ఏళ్ల యువత - **24,013**
- పోస్ట్ ద్వారా ఇప్పటి వరకూ పంపిణీ చేసిన ఎపిక్ కార్డులు- **51,143**
- సవరణ జాబితాలో నిర్వహించిన ఓటర్ల చేర్పుల శాతం- **2.72** శాతం
- సవరణ జాబితాలో నిర్వహించిన ఓటర్ల తొలగింపు శాతం- **2.57** శాతం
- వచ్చిన మొత్తం ఫారం-6,7,8 దరఖాస్తుల అభ్యంతరాలు- **1,38,497**
- ఇప్పటివరకూ పరిష్కరించినవి- **94,703**
- పెండింగ్‌లో ఉన్న ఫారం-6,7,8 దరఖాస్తులు- **43,794**
- ఎన్నికల కోసం నియమించిన జిల్లా నోడల్ అధికారులు- **16**
- సెక్టార్ అధికారులు- **143**
- సెక్టార్ పోలీస్ అధికారులు- **143**

సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

జిల్లాల్లో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలనీ, జిల్లా స్థాయిలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా కలెక్టర్ డా.మల్లికార్జునకు సూచించారు. వ్యవధి తక్కువగా ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, జాబితా తయారు చేయడంలో మరింత ప్రగతిని కనబరచాలన్నారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని జిల్లాల కలెక్టర్లతో విజయవాడ నుంచి శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న ప్రక్రియను కలెక్టర్ డా.మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సాంకేతిక సమస్యల వలన పెండింగ్ ఎక్కువగా ఉన్నట్లు చూపుతోందనీ.. వీటిని వారంలోగా పరిష్కరిస్తామన్నారు. రాజకీయ పార్టీలు తెలిపిన అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిష్కరించామని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖపట్నం, భీమిలి ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఈఆర్వోలు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగ్గజ క్రికెటర్ల సమరం

- నేటి నుంచి విశాఖలో లెజెండ్స్ క్రికెట్ టోర్నీ
- ఇక్కడి నుంచే నాకవుట్ ఖరారు





శ్రీశాంత్‌తో అభిమానుల సెల్ఫీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో మళ్లీ క్రికెట్ సందడి మొదలైంది. ఈ సారి దిగ్గజ క్రికెటర్లు క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ప్రపంచవ్యాప్త మేటి మాస్టర్ క్రికెటర్లతో కూడిన లెజెండ్స్ క్రికెట్ టోర్నీ(ఎల్‌ఎల్‌సీ)కి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. శనివారం నుంచి లీగ్ చివరి దశ మూడు టీ-20 మ్యాచ్‌లు జరగనున్నాయి. దేశంలోని ఐదు వేదికల్లో ఈ మ్యాచ్‌లు జరగనుండగా.. నాలుగో వేదికగా వైఎస్సార్ స్టేడియం నిలిచింది. ఇక్కడ జరిగే మ్యాచ్‌ల అనంతరం పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సూరత్ వేదికగా టైటిల్ కోసం నాకవుట్‌లో తలపడనున్నాయి. మాజీ క్రికెటర్లతో కూడిన ఆరు జట్లు తలపడుతుండగా.. విశాఖలో ఐదు జట్లు ఆడనున్నాయి. శుక్రవారం నాలుగు జట్లు విశాఖకు చేరుకున్నాయి.

ఆధిక్యంలో అర్బన్ రైజర్స్

టోర్నీలో భాగంగా లీగ్ దశలో ఆరు జట్లు నాలుగేసి మ్యాచ్‌లు ఆడాయి. అర్బన్ రైజర్స్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో ఆధిక్యంలో కొనసాగుతోంది. గుజరాత్ జెయింట్స్ రెండు మ్యాచ్‌ల్లో విజయంతో ఐదు పాయింట్లు, మణిపాల్ టైగర్స్ మూడు మ్యాచ్‌లే ఆడి నాలుగు పాయింట్లతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. విశాఖ వేదికగా టైగర్స్ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడనుండగా గుజరాత్ జెయింట్స్, అర్బన్ రైజర్స్ లీగ్ చివరి మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఇండియన్ క్యాపిటల్స్, సదరన్ సూపర్ స్టార్స్ జట్లు నాలుగేసి మ్యాచ్‌లాడి ఒకే విజయం సాధించాయి. ఇక బికనీర్ కింగ్స్ ఐదూ మ్యాచ్‌లను పూర్తి చేసి కేవలం ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. జెయింట్స్, టైగర్స్, అర్బన్ రైజర్స్ జట్లు దాదాపుగా నాకవుట్‌కు చేరుకోగా విశాఖలో మ్యాచ్‌లు అనంతరం క్యాపిటల్స్, సదరన్ స్టార్స్ జట్లలో ఓ జట్టు నాలుగో స్థానం సాధించి నాకవుట్‌కు చేరనుంది. వెనుకబడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించనుంది.

సత్తా చాటుతున్న లెజెండ్స్

ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్‌ల్లో దేశీయ ఆటగాళ్లతో పాటు విదేశీ ఆటగాళ్లు ఆయా జట్ల తరఫున సత్తాచాటుతున్నారు. పొదుపుగా బౌలింగ్ చేసిన రైట్ ఆర్మ్ హాఫ్ బ్రేకర్ హర్భజన్ మూడు ఇన్నింగ్స్ ఆడి 11 ఓవర్లు వేశాడు. సూపర్ స్టార్స్‌పై 10 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా కింగ్స్‌పై ఎనిమిది పరుగులిచ్చి ఒక వికెట్ తీశాడు. జెయింట్స్‌పై ఓ మేడిన్‌తో 10 పరుగులిచ్చి ఇద్దరిని పెవిలియన్ దారి పట్టించాడు. టాప్ రన్ స్కోరర్లుగా మూడు మ్యాచ్‌ల్లో రిచర్డ్ పావెల్ 126 పరుగులతో, నాలుగు మ్యాచ్‌ల్లో 121 పరుగులతో లెండీ సిమ్మన్స్ కొనసాగుతున్నారు. టాప్ వికెట్ టేకర్లుగా మూడు మ్యాచ్‌ల్లోనే పర్వీందర్, ఇమ్రాన్ ఆరేసి వికెట్లు తీయగా నాలుగు మ్యాచ్‌ల్లో అబ్దుల్ రజాక్ ఆరు వికెట్లు తీశాడు. బ్యాటింగ్ స్ట్రయిక్ రేట్ 250గా రస్టీ రెండు మ్యాచ్‌లో సాధించగా.. అప్పన్న ఒక మ్యాచ్‌లోనే సాధించాడు.

ఇవీ జట్లు

- అర్బన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సురేష్ రైనా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. స్మిత్, గుప్టిల్ ఓపెనర్లుగా రానున్నారు. టాపార్డర్‌లో గురుకీరత్‌తో పాటు కెప్టెన్ రైనా ఉంటాడు. క్రిస్, పీటర్, జెరోమ్ బంతులతో చెలరేగనున్నారు. పవన్, స్టువర్ట్, దేవేంద్ర సహకరించనున్నారు. అమిత్ వికెట్ల వెనుక నిలవనున్నాడు.
- గుజరాత్ జెయింట్స్ జట్టుకు పార్థివ్ పటేల్ నాయకత్వం వహిస్తుండగా.. ఓపెనర్లుగా కల్లిస్, క్రిస్ గేల్ వ్యవహరించనున్నారు. రిచర్డ్, కెవిన్ టాపార్డర్‌లో నిలకడగా రాణిస్తుండగా పార్థివ్ ఈ మ్యాచ్‌లో ఆడకుంటే ధ్రువ్ వికెట్ల వెనుక నిలవనున్నాడు. ఎమిత్, శ్రీశాంత్ బౌలింగ్‌ను ఓపెన్ చేయనుండగా సర్బజీత్, ప్రసన్న, ఈశ్వర్, సులేమాన్‌లు బౌలింగ్‌లో సత్తాచాటనున్నారు.
- మణిపాల్ టైగర్స్ జట్టుకు హర్భజన్ సింగ్ నాయకత్వం వహిస్తుండగా రాబిన్ ఉతప్ప, బద్రీనాథ్ ఓపెనర్లుగా దిగుతారు. హామిల్టన్, మహ్మద్ కైఫ్, పెరీరా టాపార్డర్‌లో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బౌలర్లు మిచెల్, పర్వీందర్, పెరీరా, ఇమ్రాన్, ప్రవీణ్,కొలిన్ ఉన్నారు.
- గౌతమ్ గంభీర్ సారథిగా వ్యవహరించే ఇండియా క్యాపిటల్స్‌లో రిచర్డ్ పావెల్, జ్ఞానేశ్వర్, ఎడ్వర్డ్స్, కెవిన్ పీటర్సన్, రస్టీ, ఉదానా, బెన్నట్, అప్పన్న, ఆస్లే బౌలింగ్ తదితరులు ఉన్నారు.
- రాస్ టేలర్స్ సారథిగా ఉన్న సదరన్ సూపర్ స్టార్స్ జట్టులో దిల్షాన్, తరంగా ఓపెనర్లుగా దిగనున్నారు. వికెట్ల వెనుక శ్రీవత్స్ నిలవనున్నాడు. టాపార్డర్‌లో చతురంగతో కలిసి టేలర్స్ కొనసాగనున్నాడు. లక్మాల్, దిండా, రజాక్‌తో పాటు హమీద్, బిపుల్, దిల్షాన్, పవన్ నేగీ బౌలింగ్ వేయనున్నారు.

ఇదీ షెడ్యూల్

	తలపడనున్న జట్లు	మ్యాచ్ ప్రారంభం
2వ తేదీ	ఇండియా క్యాపిటల్స్ x మణిపాల్ టైగర్స్	సా॥ 6.30 గంటలు
3వ తేదీ	గుజరాత్ జెయింట్స్ x సదరన్ సూపర్‌స్టార్స్	సా॥ 3 గంటలు
4వ తేదీ	మణిపాల్ టైగర్స్ x అర్బన్ రైజర్స్ హైదరాబాద్	సా॥ 6.30 గంటలు

(Paytm Insider (https://insider.in/visakhapatnam)లో టికెట్లు కొనుగోలు చేసి.. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించవచ్చు)

సైగ చేసినా రక్షణ

- ఆపద వేళ ఆదుకునేలా 'దిశ దివ్యాంగ సురక్ష'
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- దేశంలోనే తొలిసారిగా విశాఖ పోలీసుల వినూత్న ప్రయత్నం



దివ్యాంగ బాలికతో ముచ్చటిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్



దిశ దివ్యాంగ సురక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, సీపీ రవిశంకర్ తదితరులు

ఏయూక్యాంపస్: ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం మనదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విశాఖ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశ దివ్యాంగ సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు అన్నివేళలా ప్రభుత్వం రక్షగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగా విశాఖ పోలీసులు వినూత్న ప్రయత్నానికి అభినందనలు తెలిపారు. మూగవారి కోసం కోసం కేవలం సైగలు చేస్తే చాలు కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేరేలా ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేయడం, అలాగే అంధుల కోసం ప్రత్యేక వాట్సప్ కాల్ చేసేలా ప్రత్యేక నంబర్ కేటాయించడం దేశంలోనే తొలిశారన్నారు. సీఎం ప్రజల పట్ల, కష్టాలలో ఉన్నవారిపట్ల ఎలా స్పందిస్తారు అనడానికి దిశ యాప్ ఒక ఉదాహరణగా నిలుస్తోందన్నారు. పొరుగు రాష్ట్రంలో జరిగిన ఒక సంఘటన ఎక్కడా జరగకూడదని, అక్కచెల్లెళ్లకు సంపూర్ణ భద్రత కల్పించే విధంగా దిశ చట్టం, దిశ యాప్ రూపకల్పన చేశారన్నారు. రాష్ట్రంలో సీనియర్ అధికారులు నేడు ముఖ్యమంత్రి ఆలోచనలకు మరింత ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. దివ్యాంగులకు ఉపయుక్తంగా నూతన సేవలను రూపకల్పన చేసి అమలు చేసిన పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్‌ను వేదికపై సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

దివ్యాంగ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ దివ్యాంగులు పారిశ్రామికవేత్తలుగా స్టార్టప్‌లో అడుగేస్తే సహకారం అందించి ప్రోత్సహిస్తామన్నారు. సాధారణ వ్యక్తులకంటే మిన్నగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మరింత సౌలభ్యంతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపకల్పన చేసే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను చేపడుతున్న విశాఖ పోలీసు శాఖను అభినందించారు. నగర మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ సచివాలయాలద్వారా ఈ సేవలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేపడతామన్నారు. ఇప్పటికే దిశ చట్టం చరిత్రాత్మకంగా నిలుస్తూ, మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. నేడు దివ్యాంగులకు అవసరమైన నూతన దిశ దివ్యాంగ సురక్ష సేవలు అందుబాటులోకి రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ అధికారి బి.శ్రీనివాసరావు, ఎన్‌జీఓ నిర్వాహకురాలు సుచిత్ర తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా దివ్యాంగ చిన్నారుల నృత్యాలు, గీతాలాపన అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పెద్దసంఖ్యలో పోలీసు అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

మూగ బాలిక వీడియో కాల్.. నిమిషాల్లో వచ్చిన పోలీసులు

తాను వైద్యుడిగా సేవలు అందిస్తున్న సమయంలో జరిగిన ఒక సందర్భం తనకు ఈ ఆలోచన రావడానికి కారణమని సీపీ రవిశంకర్ అయ్యనార్ వివరించారు. అంధుల కోసం 73373 24466, మూగవారి కోసం 73374 34422 నంబర్లను ఏర్పాటు చేశామన్నారు. వీరు సంజ్ఞలతో చెప్పే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌లో ఉండే నిపుణులు విశ్లేషించి వెంటనే వారి వద్దకు పోలీసులను పంపడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి సేవలు అందించే విధానాన్ని ప్రత్యక్షంగా వేదికపై ప్రదర్శించి చూపారు. వేదికపై నుంచి ఒక మూగ బాలిక వీడియో కాల్ చేసి తనకు జరిగిన ఇబ్బందిని కాల్ సెంటర్‌కు వివరించడం, వెంటనే వారు పోలీసు కానిస్టేబుల్‌ని బాలిక వద్దకు నిమిషాల వ్యవధిలో పంపడం ప్రత్యక్షంగా చూపారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం



మాట్లాడుతున్న నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అజెండాలో పొందుపరిచిన 25 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పొందుపరిచిన 9 అంశాలు, మొత్తంగా 34 అంశాలు స్థాయీ సభ్యులు చర్చించి ఆమోదించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.6.64 కోట్ల అభివృద్ధి పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలకు అదనపు కార్మికుల సేవలు తాత్కాలికంగా వినియోగించుకునేందుకు, రూ.97.82 లక్షలతో ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు, యూసీడీ విభాగానికి సంబంధించి రూ.3.8 లక్షలతో ఎకో వైజాగ్ కార్యక్రమాల సామగ్రి సరఫరాకు సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, యూసీడీ పీడీ కెవి పాపునాయుడు, కార్యదర్శి నల్లనయ్య, కార్యనిర్వాహక ఇంజినీర్లు శాంతిరాజ్, మత్స్యరాజు, రమణమూర్తి, రత్నాకర్‌రెడ్డి, వేంకటేశ్వరరావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన 8లో

లెజెండ్స్ వచ్చేశారు



విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న లెజెండరీ క్రికెటర్లు



గోపాలపట్నం: విశాఖలో మూడు రోజుల పాటు జరగనున్న లెజెండ్స్ క్రికెట్ లీగ్‌లో పాల్గొనేందుకు ఆయా జట్లు శుక్రవారం విశాఖ చేరుకున్నాయి. ఇండియా క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, మణిపాల్ టైగర్స్, సదరన్ సూపర్ స్టార్స్ జట్ల సభ్యులు జమ్ము నుంచి వచ్చారు. ఇండియా క్యాపిటల్స్ డైరెక్టర్ వై.వేణుగోపాల్, క్రికెటర్లు వై.జ్ఞానేశ్వరరావు, పీటర్సన్, మునాఫ్ పటేల్, శ్రీశాంత్, ప్రవీణ్ కుమార్, పార్థివ్ పటేల్, అశోక్ దిండా, క్రిస్ గేల్ తదితరులను చూసిన అభిమానులు..సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

- భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత
- కార్యక్రమాన్ని ప్రారంభించిన వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్
- తొలి రోజు సుమారు 1,256 మందికి నియామకపత్రాల అందజేత



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నిరుద్యోగ యువతీ, యువకులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఓ కంపెనీ ప్రతినిధి

మల్కాపురం: రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 59వ వార్డులోని జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న అండాళమ్మ కళాశాలలో ఏపీ సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ప్రభుత్వ సలహాదారుడు మిలీనియం శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ముందుగా ఈ మేళాను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించారన్నారు. వలంటీర్ వ్యవస్థతో మరో రెండు లక్షల మందికి ఉపాధి చూపారన్నారు. రాష్ట్రానికి ఐటీ కంపెనీలతో పాటు పలు పరిశ్రమలను తీసుకొస్తూ మరికొంత మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగమని చెప్పి మోసం చేశారని, నిరుద్యోగ భృతి ఇస్తామని చేతులెత్తేశారని విమర్శించారు. పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా సేవలు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని, అలాంటి వ్యక్తి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఇంత చక్కటి మెగా జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పనకు చొరవ చూపిన ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించిన పలువురికి ఆయన నియామక పత్రం అందజేశారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి మాట్లాడుతూ తొలి రోజు ఊహించని విధంగా మంచి స్పందన లభించిందన్నారు.

ఈ మేళాలో వివిధ కంపెనీల్లో సుమారు 1,256 మంది ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, పార్టీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్,ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



చంటి పిల్లాడితో ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థి

చాలా సంతోషంగా ఉంది



పారిశ్రామిక ప్రాంతంలో జాబ్‌మేళా నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఫార్మా కంపెనీకి ఇంటర్వ్యూకు వెళ్లాను. ఉద్యోగం తప్పక వస్తుందన్న నమ్మకం కలిగింది.

– జి.అశ్వని(బీఎస్‌ఈ), పూర్ణామార్కెట్

పలు కంపెనీలు ఒకే వేదికపై చూడటం తొలిసారి



ఒకే వేదికపై ఇన్ని కంపెనీలు ఇంటర్వ్యూ నిర్వహించడం బాగుంది. బీటెక్ సీఏస్‌సీ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం పలు చోట్లకు తిరగాల్సిన పరిస్థితి ఉంది. కానీ నేడు ఇక్కడే పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. ఏదో ఒక కంపెనీలో జాబ్ వస్తుందన్న నమ్మకం ఉంది.

– ఎం.రవళి, బీటెక్, శ్రీహరిపురం

ఉద్యోగం సాధించా..



ఎంబీఏ(హెచ్‌ఆర్) పూర్తి చేశాను. ఒకే చోట ఇన్ని కంపెనీలు నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. నాకు డిజిటల్ వుమెన్ సర్వీసులో ఉద్యోగం వచ్చింది. రూ.3.8 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యాను.

– అనిత, ఎంబీఏ, మల్కాపురం

టెక్ మహీంద్రాలో జాబ్ వచ్చింది

బీటెక్ పూర్తయింది. ఇక్కడ నిర్వహించిన ఇంటర్వ్యూలో టెక్ మహీంద్రా కంపెనీలో ఉద్యోగం సాధించాను. మంచి ప్యాకేజీ కూడా లభించింది. ట్రైనింగ్ పీరియడ్ రూ.3లక్షల ప్యాకేజీ కాగా.. అనంతరం రూ.8 లక్షల వార్షిక ప్యాకేజీకి ఒప్పందం జరిగింది. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి బృహత్తర కార్యక్రమం నిర్వహించిన ఆడారి ఆనంద్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– కె.మణికంత, బీటెక్, ఏదురవానిపాలెం

ఈ నెలలోనే విశాఖ నుంచి సీఎం జగన్ పాలన

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అట్టహాసంగా నెరెడ్కో ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

మధురవాడ: విశాఖ కేంద్రంగా ఈ నెల నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. మధురవాడ వీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరిగే నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నెరెడ్కో) ప్రాపర్టీ ఎక్స్‌పో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో కలిసి ఆయన ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్, నిర్మాణ, బ్యాంకు రంగాలకు చెందిన స్టాళ్లను తిలకించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్, నిర్మాణ ఇతర రంగాలకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గతంలో కొంత మంది రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని.. వాటిని చాలా వరకు పరిష్కరించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల నుంచే పాలన ప్రారంభిస్తారని.. ఏమైనా సమస్యలుంటే మరింత త్వరగా పరిష్కారవుతాయన్నారు. అన్ని వర్గాలు వారికి అందుబాటులో ఉండే విధంగా రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి, భవన నిర్మాణాలు చేయాలన్నారు. తద్వారా ఆయా సంస్థల వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా.. ఎక్స్‌పోలో 70 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఎక్స్‌పోను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, నార్త్ జోన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి డి.పాపారావు, విశాఖ అధ్యక్షుడు నాగకుమార్, కార్యదర్శి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు తోడ్పాటు అందరి బాధ్యత

- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- చిన్నారులతో కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్
- 116 మందికి పోషకాహార కిట్లు

మహారాణిపేట: ఎయిడ్స్ బారిన పడిన చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అందరూ పెద్ద మనసుతో ముందుకు రావాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా సంజీవని సంక్షేమ నిధికి విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యారోగ్య, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, చిన్నతనంలోనే అనుకోని కారణాలతో ఎయిడ్స్ బారిన పడిన చిన్నారులు, కేంద్రాల్లో వివిధ సమస్యలతో జీవనం సాగిస్తున్న అభాగ్యుల్లో మానసిక స్థైర్యం కలిగించి, ఉన్నత స్థానాలకు చేరుకునేలా తోడ్పాటు అందించాల్సిన నైతిక బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటిన పుష్పగుచ్ఛాలకు బదులు ఆర్థిక విరాళాలు అందించి పెద్ద మనస్సు చాటుకోవాలన్నారు. పోషకాహార కిట్ల పంపిణీకి సీఎంఆర్ యాజమాన్యం ముందుకు వచ్చి రూ.6 లక్షలు సమకూర్చడం సంతోషదాయకమన్నారు. అనంతరం 116 మందికి రూ.690 విలువైన పోషకాహార కిట్లను జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ అందజేశారు.

చిన్నారులతో కలిసి కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్

ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యారోగ్య శాఖ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో అనాథలు, ఎయిడ్స్ బాధిత చిన్నారులతో కలిసి కలెక్టర్ మల్లికార్జున కమ్యూనిటీ బ్రేక్ ఫాస్ట్ చేశారు. బాధిత చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడారు. వివిధ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న అనాథలు, మానసిక, శారీరక వికలాంగులు, ఎయిడ్స్ బాధిత చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం కింద లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టరేట్ నుంచి అవగాహన ర్యాలీ

ఎయిడ్స్ డే సందర్భంగా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా పరిషత్ కార్యాలయం వరకు సాగింది. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్వాహకులు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

- లేఅవుట్ అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిదే..
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార: అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. విశాఖ అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం అమరావతిలో ఆయన్ని కలిశారు. ఇళ్ల మంజూరు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. జగనన్న కాలనీ ద్వారా సెంటు స్థలం పొందిన వారు, గతంలో టిడ్కో ఇళ్లు, మరే ఇతర ప్రభుత్వ పథకంలో ఇంటి స్థలం పొందిన జర్నలిస్టులు వాటిని తిరిగి ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తద్వారా జర్నలిస్టు హౌసింగ్ పథకానికి అర్హులుగా పరిగణించేలా చూస్తామన్నారు. ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా జీవో రూపొందించామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఎదురైన ఇబ్బందులన్నింటినీ పరిగణలోనికి తీసుకుని.. అర్హులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు అందించేందుకు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వమే లేఅవుట్ వేసి అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. జిల్లాల వారీగా ప్రభుత్వ స్థలాలు గుర్తించి.. వీలైనంత త్వరగా కేటాయిస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేతృత్వంలో స్క్రూటినీ కమిటీని నియమిస్తామని, అందులో జర్నలిస్టులకు భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. ఈ ఏడాది అక్రిడిటేషన్ లేని వారికి సీనియార్టీ ప్రాతిపదికన స్థలాలు కేటాయించే అంశం పరిశీలనలో ఉందన్నారు. హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు, సాక్షి బ్యూరో చీఫ్ కె.జి.రాఘవేంద్రరెడ్డి, జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్, ఉపాధ్యక్షుడు కె.పరశురాం, సహాయ కార్యదర్శులు బి.శివప్రసాద్, ఎం.చిట్టిబాబు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీఐపీ రోడ్డులో తనిష్క్ స్టోర్ ప్రారంభం



తనిష్క్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ అరుణ్ నారాయణ్

మద్దిలపాలెం: టాటా సంస్థకు చెందిన రాష్ట్రంలోనే అతిపెద్ద స్టోర్ తనిష్క్ నగరంలోని వీఐపీ రోడ్డులో శుక్రవారం ప్రారంభమైంది. ఈ స్టోర్‌ను బిజినెస్ అసోసియేట్ ఉప్పలపాటి రాజా సమక్షంలో తనిష్క్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ నారాయణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ తనిష్క్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 3వ తేదీ వరకు ప్రతీ కొనుగోలుపై ఉచితంగా బంగారు నాణేలు అందిస్తున్నట్లు చెప్పారు. 1,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన స్టోర్‌లో బంగారం, వజ్రాలు రెండింటిలోనూ సుమారు 5వేల పైగా డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అరుణ్ నారాయణ్ మాట్లాడుతూ విశాఖలో అతిపెద్ద స్టోర్‌ను ప్రారంభించామన్నారు. నాణ్యమైన వ్యక్తిగత కలెక్షన్లను అందుబాటులో ఉంచామని, ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభూతిని కలిగేలా స్టోర్‌ను తీర్చిదిద్దామన్నారు. స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా విదేశీ యువతులతో ఏర్పాటు చేసిన మ్యాజిక్ ఈవెంట్ అందరినీ ఆకట్టుకుంది. తనిష్క్ ఆభరణాలతో స్థానిక మహిళలు చేసిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనిష్క్ రీజినల్ మేనేజర్ శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా సత్తి మందారెడ్డి



సత్తి మందారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: సుందరయ్యనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తి మందారెడ్డిని ప్రభుత్వం జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా నియమించింది. దీనికి సంబంధించిన నియామక పత్రం అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ని ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మందారెడ్డి పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్సీవంశీకృష్ణ శ్రీనివాస్, నాయకుడు జీవీ, కార్పొరేటర్ ఎ.రోహిణికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు హెచ్‌పీసీఎల్ సాయం

రూ.1.22 కోట్ల వైద్య పరికరాల అందజేతకు అంగీకారం

మహారాణిపేట: సామాజిక బాధ్యతలో భాగంగా హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు రూ.1.22 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందించేందుకు అంగీకారం తెలిపింది. ఇందుకు సంబంధించి హెచ్‌పీసీఎల్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మధ్య శుక్రవారం ఎంవోయూ జరిగింది. హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రత్నారాజ్, ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ పి.విశ్వమిత్ర ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.విశ్వమిత్ర హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైద్యులు, హెచ్‌పీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

'వసంతం-2023' ప్రారంభం



చేనేత ప్రదర్శన ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో 'వసంతం–2023' పేరిట ఏర్పాటు చేసిన హస్తకళలు, చేనేత ప్రదర్శనను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మేయర్ తిలకించారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు రోజుల పాటు హస్తకళలు, చేనేతల ప్రదర్శన ఉంటుందన్నారు. కుడ్య చిత్రాలు, టెర్రకోట కళాఖండాల నుంచి కళానైపుణ్యతతో రూపొందించిన నేత వస్త్రాల వరకు ఎన్నో కళాఖండాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగా, అసోం, మణిపూర్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర పలు ప్రాంతాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు, కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

అక్కిరెడ్డిపాలెం: చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. గాజువాక గోపాల్‌రెడ్డినగర్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావు ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కుమార్తె(15)తో పాటు బీటెక్ చేస్తున్న మరో కుమార్తె ఉన్నారు. గాజువాకలోని ఓ స్కూల్‌లో ఆమె 10వ తరగతి చదువుతోంది. చదువు ఒత్తిడితో పాటు తల్లిదండ్రులు మందలిస్తుండటంతో బాలిక మనస్తాపానికి గురైంది. డ్రిల్లు క్లాస్ ఉందని చెప్పి గురువారం స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. తండ్రి విధులకు, సోదరి కళాశాలకు వెళ్లారు. సాయంత్రం వరకు తన గది నుంచి ఆమె బయటకు రాలేదు. గదిలో తన కుమార్తె నిద్రపోయి ఉంటుందని తల్లి అనుకుంది. ఎంత సేపటికి తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు కొట్టింది. తీయకపోవడంతో బలవంతంగా తెరిచి చూస్తే.. బాలిక ఆత్మహత్య చేసుకుని మరణించింది. వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ నజీర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.